క్లుప్తంగా

నేడు కేంద్ర బృందం పర్యటన

మాడుగుల రూరల్: ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించేందుకు కేంద్ర బృందం మండలంలో మూడు గ్రామాల్లో ఆదివారం పర్యటించనున్నట్టు మండల ఉద్యానవనశాఖాధికారి వి.భానుపుష్ప లీలావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయి ల్ సీడ్స్ జాయింట్ కార్యదర్శి(న్యూఢిల్లీ) అజిత్ కుమార్ సాహూ, ఇతర సభ్యులు రఘు నందన్‌రావు, కె.పోన్నుస్వామి తో పాటు రాష్ట్ర ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ కె.బాలాజీ నాయిక్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి జి. ప్రభాకరరావు పర్యటించనున్నట్టు తెలిపారు. చింతలూరు, తాటిపర్తి, శంకరం గ్రామాల్లో వీరు పర్యటించిన అనంతరం బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్టలో శాంతి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సందర్శిస్తారని ఆమె పేర్కొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న గురుస్వామి మూర్తి

కె.కోటపాడు : గొండుపాలెంలో జ్ఞాన ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ 15వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మాలాధారులైన అయ్యప్ప భక్తులతో పాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు బండారు వెంకట రమణమూర్తి, బండారు రాము తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం



వ్యాయామ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు

గొలుగొండ: చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు కుందూరు నూకరాజును ఆ పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు శనివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన క్రీడా పోటీల్లో ఈ హైస్కూల్ నుంచి పాల్గొన్న విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి, బహుమతులు పొందారు. వారికి శిక్షణ ఇచ్చిన నూకరాజును అభినందిస్తూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, స్కూల్ కమిటీ చైర్మన్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయాలు జరిపితే చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ మధుకుమార్

గొలుగొండ: సారా తయారీ, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని గొలుగొండ ఎక్సైజ్ సీఐ మధుకుమార్ హెచ్చరించారు. కృష్ణదేవిపేటలో శనివారం నిర్వహించిన నవోదయం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా ఇటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని తెలిపారు. పలు గ్రామాల్లో ఇప్పటికే కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

అభివృద్ధి పనులు వేగవంతం



రామన్నపాలెంలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం: గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఆదేశించారు. మండలంలోని శెట్టిపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ పనులను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో తాత్సారం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలని నిర్మాణ కమిటీలకు సూచించారు. అంతకు ముందు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద సిబ్బందితో కలసి చెత్తను తొలగించారు.

ప్రయాణం భయం భయం



రక్షణ గోడలు లేని గవరపాలెం వద్ద కల్వర్టు



ఒక వైపు రక్షణ గోడ లేని దాలివలస వద్ద కల్వర్ట్

మండలంలోని రైవాడ కెనాల్‌పై గల కల్వర్టులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రక్షణ గోడలు శిథిలమవడంతో వాహనచోదకులు బితుకు బితుకుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. రక్షణ గోడలు నిర్మించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.



ఉగ్గినవలస మార్గంలో ఛిద్రమైన కల్వర్టు రక్షణ గోడలు

- రైవాడ కెనాల్ కల్వర్టులపై ఛిద్రమైన రక్షణ గోడలు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- ఇబ్బందులు పడుతున్న 20 గ్రామాల ప్రజలు

కె.కోటపాడు : మండలంలోని పలు రహదారుల్లో గల కల్వర్టులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రైవాడ కెనాల్‌పై ఎనిమిది గ్రామాల సమీపంలో నిర్మించిన కల్వర్టుల రక్షణ గోడలు ఛిద్రమవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం మరీ ప్రమాదకరంగా మారింది. గోడలు లేకపోవడంతో వాహనదారులు కల్వర్టుల పై నుంచి కెనాల్ నీటి ప్రవాహంలో పడి గాయాలపాలవుతున్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రమాదం జరిగితే ప్రాణాల మీద ఆశ వదులుకోవలసిన పరిస్థితి. కల్వర్టు మీద ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో తప్పించుకునే సమయంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని పలు గ్రామాల ప్రజలు తెలిపారు.

20 గ్రామాల ప్రజలకు ఇక్కట్లు

మండలంలో పోతనవలస, ఉగ్గినవలస, గవరపాలెం, డి.అగ్రహారం, దాలివలస, కె.కె.అగ్రహారం, సూదివలస, కొరువాడ ప్రాంతాల వద్ద కెనాల్‌పై తొమ్మిది చోట్ల కల్వర్టులున్నాయి. వీటిలో ఒక కల్వర్టు మినహా మిగతా కల్వర్టుల రక్షణ గోడలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. వీటిపై నుంచి సుమారు 20 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలతోపాటు ఇతర వాహనాలు కల్వర్టులపై ప్రయాణిస్తుంటాయి. ఈ కల్వర్టులను 20 ఏళ్ల కిందట జీవీఎంసీ అధికారులు నిర్మించారు. ఆ తరువాత నుంచి వీటిని పట్టించుకోవడం మానేశారు. రక్షణగోడలు శిథిలమవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలు గ్రామాల ప్రజలు తెలిపారు.

రక్షణ గోడలు నిర్మించాలి



కల్వర్టులపై రక్షణ గోడలు పూర్తిగా శిథిలావస్థ కు చేరుకున్నాయి. రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనచోదకులు గాయాలబారిన పడుతున్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగితే ప్రాణాల మీద ఆశ వదులుకోవలసిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలి.

– ఆదిరెడ్డి రామునాయుడు, వాహనదారుడు, దాలివలస

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



చౌడువాడలో ఉద్యమ నేతల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి



గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారులు

కె.కోటపాడు : విద్యార్థులు, ఉద్యోగార్థులు గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకోవాలని చౌడువా డ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి తెలిపా రు. గ్రంథాలయవారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమ నేతలు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల సర్వోత్తమరావు, డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథరావు చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ నెల 20 వరకూ గ్రంథాలయవారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆమె చెప్పారు.

నర్సీపట్నం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమ నాయకుల సంస్మరణ సభ జరిగింది. గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయాల స్థాపనకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆ తర్వాత వావిలాల గోపాలకృష్ణ, పాతూరు నాగభూషణం, వెలగా వెంకటప్పయ్య లాంటి వారు ఆ కృషిని కొనసాగించారన్నారు. జాతీయ గ్రంథాలయోద్యమ నాయకులు ఎస్సార్ రంగనాథన్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనంతరం లైబ్రేరియన్ దమయంతి, విశ్రాంత లైబ్రేరియన్ కన్నబాబు, జి.మురళీకృష్ణ, గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు.

చీడికాడ: స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్ తదితర పోటీల్లో విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధి కారి జోగీశ్వరి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు.

మాడుగుల రూరల్: కేజే పురంలో గ్రంథాలయాధికారి వి.శృతి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్.ఆర్.రంగనాథ్, అయ్యంకి వెంకటరమణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోలుగుంట: గ్రంథాలయం వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక హైస్కూలు,కొమరవోలు,స్థానిక కేజీబీవీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

15 మందికి ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఏపీఎస్ఎస్‌డీసీ, స్కిల్ హబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగమేళాలో 15 మందికి ఉద్యోగవకాశాలు లభించాయి. ఈ మేళాలో 30 మంది నిరుద్యోగులు పాల్గొన్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బి.అప్పలనాయుడులు తెలిపారు. వీరిలో 15 మందిని ఎంపిక చేసినట్టు నవత హెచ్‌ఆర్ డి.వేదవ్యాస్, పేటీఎం హెచ్‌ఆర్ ఎ.కృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రితీష్, సీడాప్ కోఆర్డినేటర్ లక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, సీనియర్ ఉపన్యాసకులు హెచ్.సుధీర్, ఎస్.ఎం.రఫీయుద్దీన్, సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

తూటిపాలలో నో బ్యాగ్ డే



కాగితాలతో తయారు చేసిన బొమ్మలతో విద్యార్థులు

మాకవరపాలెం: మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. 1,2 తరగతుల విద్యార్థులు బ్యాగులు లేకుండా పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వివిధ రకాల కాగితం బొమ్మలు తయారు చేయించి, ఆటలు ఆడించారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా నో బ్యాగ్ డేను నిర్వహిస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోషి, లోవరాజు, నారాయణరావు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ సారె ఊరేగింపు



మాడుగుల గవర వీధిలో సారె ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

మాడుగుల: గౌరీ పరమేశ్వర ఉత్సవాల్లో భాగంగా స్థానిక గవరవీధిలో శనివారం సారె ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: కార్తీక పాడ్యమి సందర్భంగా శనివారం పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఎం.కోడూరు కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం కేజే పురం, వీరవల్లి, జంపెన, పిట్టగెడ్డ, మాడుగులలోని శివాలయాలల్లో పూజలు నిర్వహించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం: వచ్చేనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ తెలిపారు. కోర్టు సముదాయంలో పోలీసు ఉన్నతాధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసుల్లో కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు వృథా కాదన్న విషయాన్ని కక్షిదారులు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ మోహన్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.ప్రభాకర్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండల సర్వ సభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన నిర్వహించనున్న ట్టు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని గ్రామాల ఎంపీటీసీ,సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా ఆదివారం ఏర్పాటు చేసిన మండల సమావేశానికి ఆయా శాఖల అధికార్లు తగిన సమాచారంతో విధిగా హాజరుకావాలన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



కంచుగుమలలో కార్యదర్శి సాల్మన్, సిబ్బందికి సూచలిస్తున్న ఎంపీడీవో నాగేశ్వరరావు

రోలుగుంట: మండలంలోని కంచుగుమలలో పారిశుధ్యం పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరావు శనివారం ఆ గ్రామాన్ని సందర్శించి వీధులను, డ్రైనేజీలను పరిశీలించారు. గ్రామ కూడళ్లలో ఉన్న చెత్తను వెంటనే సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని పంచాయతీ కార్యదర్శి సాల్మన్‌ను, సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీల్లో పూడికలు తీయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రామ్మూర్తి, మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద దీపాలంకరణ



శివలింగాకారంలో అలంకరించిన దీపాలు

కె.కోటపాడు : చౌడువాడలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి దీపాలంకరణను నిర్వహించారు. ధనిమిశెట్టి, సియ్యాద్రి కుటుంబాలకు చెందిన వారు ఈ దీపాలంకరణ జరిపారు. శివలింగాకారం, స్వస్తిక్, ఓంకారం ఆకారంలో దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలి



బేతపూడి కేజీబీవీలో వంటకాను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి మంజులవాణి



చీపురుతో చెత్తచెదారాలను తొలగిస్తున్న మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకాకారం రుచికరమైన భోజనం పెట్టాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి సూచించారు. రైవాడ పంచాయతీ శివారుబేతపూడి కేజీబీవీని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంటశాలను పరిశీలించి, విద్యార్థినుల కోసం తయారు చేసిన ఆహారపదార్థాలను రుచి చూశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు పెట్టే ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం తరగతి గదులను పర్యవేక్షించారు. అంతకు ముందు దేవరాపల్లి అంబేడ్కర్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ తదితరులతో కలిసి చీపురు పట్టి చెత్తా చెదారాలను తొలగించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, నిర్వహణపై పంచాయతీ, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ముగిసిన రెవెన్యూ గ్రామ సభలు



రోలుగుంట సభలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట: రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సభలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు రోలుగుంటలో నిర్వహించిన సభలో పలు భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను తహసీల్దార్ ఎస్.నాగమ్మ రైతుల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ 16 రెవెన్యూ గ్రామ సభల్లో సుమారు 230 వినతులు స్వీకరించామని, వాటన్నిటినీ త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. రోలుగుంటలో నిర్వహించిన సభలో డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు, ఆర్‌ఐ రామ్మూర్తి, మండల సర్వేయర్ తవుటు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సుస్థిర అభివృద్ధే లక్ష్యం



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న జిల్లా అధికారి సోమేశ్వరరావు, చీఫ్ మేనేజరు కిశోర్

నాతవరం: మహిళలు, యువత, బలహీన వర్గాలకు చేయూత అందించి, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు సహకరించడమే సహకార సంఘాల లక్ష్యమని జిల్లా సహకార శాఖాధికారి జి.సోమేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా ఈనెల 14 తేదీ నుంచి 20 వ తేదీ వరకూ సహకార సంఘాల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. వారోత్సవాల సందర్భంగా స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద శనివారం జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల కార్యకలాపాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో కోటవురట్ల సెంట్రల్ బ్యాంకు చీఫ్ మేనేజరు కిశోర్, కోటవురట్ల బ్రాంచి సూపర్‌వైజరు సత్యనారాయణ, నాతవరం పీఏసీఎస్ సీఈవో ఆదినారాయణ, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులు బాధ్యతతో మెలగాలి



రోగులకు పండ్లు అందజేస్తున్న డీఎస్పీ మోహన్, సీఐలు రేవతమ్మ, గోవిందరావు

నర్సీపట్నం: పాత్రికేయులు సామాజిక రుగ్మతలు, సమస్యల పట్ల బాధ్యతతో స్పందించాలని డీఎస్పీ మోహన్ తెలిపారు. జాతీయ పత్రిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీయుడబ్ల్యూజే నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలోని రోగులకు డీఎస్పీ చేతుల మీదగా పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తలు సామాజిక చైతన్యానికి దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఎల్.రేవతమ్మ, జి.గోవిందరావు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు సీహెచ్.బి.ఎల్.స్వామి, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బేరా చినబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.డి.బాబు, శ్రీనివాస వర్మ, శివ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, రామకృష్ణ, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చెత్తను తొలగిస్తున్న ఎంఈవో వరహాలబాబు



చుక్కపల్లిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో హేమసుందరరావు

నాతవరం: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరని ఎంఈవో కామిరెడ్డి వరహాల బాబు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంఈవో, ఎంపీడీవో, తహసీల్దార్, విద్యుత్, వెలుగు కార్యాలయాలు, పీహెచ్‌సీ వద్ద శనివారం ఆయా కార్యాలయాల సిబ్బంది పరిసరాలను శుభ్రపరిచారు.ఈ సందర్భంగా ఎంఈవో కార్యాలయం వద్ద వరహాల బాబు మాట్లాడారు. ఇంటింటికీ అందించిన డస్ట్‌బిన్లలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఎస్.వి.మూర్తి, పంచాయతీ కార్యదర్శి లాలం శేషు కుమార్, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, ఎంఆర్‌సీ మండల కోఆర్డినేటరు అంకంరెడ్డి శ్రీనివాస్‌నాయుడు, దంగేటి సాంబ, సీఆర్పీలు వెంకటలక్ష్మి, గోవిందు, పోలుపర్తి నాగేశ్వరరావు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని స్థానిక ఎంపీడీవో వి.హేమసుందరరావు అన్నారు. మండలంలోని చుక్కపల్లిలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సంపద సృష్టి కేంద్రంలోని వర్మీ కంపోస్టు యూనిట్లలో వానపాములను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి లక్ష్మణమ్మ,ఎంపీటీసీ సుంకర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి గ్లాసుల వితరణ

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి దాతలు శనివారం గ్లాసులు అందజేశారు. అన్నసమారాధన తదితర సమయాల్లో భక్తులు వినియోగించేందుకు వీలుగా సత్యసాయి భక్తులు పాలకుర్తి మోహన్‌రావు, భార్య కుసుమ 67 మంచినీటి గ్లాసులను ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావుకు అందజేశారు.